క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతరకు ఆహ్వానం



డాక్టర్ సాయిరాం

పరవాడ: అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర వరల్డ్ రికార్డులో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు కవి, రచయిత, గాయకుడు, సామాజిక వేత్త ఎంఎస్ఎస్ సాయిరాం మంగళవారం మీడియాకు తెలిపారు. ఆయన గత కొంత కాలంగా పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో సామాజిక రచనలు, వివిధ సాహితీ ప్రక్రియలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం ఆయనకు ఉంది. ఆహ్వానం అందుకున్న సాయిరాంను పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్, వైద్య సిబ్బంది అభినందించారు.

ఫోరం ఫర్ ఆర్టీఐ విశాఖ అధ్యక్షుడిగా వడ్డాది



వడ్డాది ఉదయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆర్టీఐ కమిషనర్ రెహనా బేగం

మహారాణిపేట: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పడిన ఫోరం ఫర్ ఆర్టీఐ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ వడ్డాది ఉదయకుమార్ నియమితులయ్యారు. మంగళగిరిలో జరిగిన ఆర్టీఐ దినోత్సవంలో ఫోరం జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయకుమార్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ప్రజలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన కలిగించేందుకు త్వరలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయకుమార్‌ను ఆర్టీఐ కమిషనర్ రెహనా బేగం అభినందించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ చిన్నికృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్ఏలు

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణను మండల వీఆర్వోలు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు నీటిపల్లి గంగాధరరావు ఆధ్వర్యంలో పలువురు వీఆర్ఏలు మంగళవారం కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మండలంలో వీఆర్ఏలపై పని ఒత్తిడి ఎక్కువగా ఉందన్నారు. ఖాళీగా ఉన్న వీఆర్ఏల పోస్టుల్ని కొత్తవారితో నియమించేలా చూడాలని విన్నవించారు. ఖాళీ పోస్టుల్ని భర్తీ చేస్తే తమపై ఉన్న పనిభారం కొంతైనా తగ్గుతుందన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో వీఆర్ఏలు ఎం.అప్పారావు, నర్సింగరావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మద్యంపై నియంత్రణ.. కూటమి ప్రభుత్వంలో గేట్లెత్తేస్తున్నారు. అధికారపార్టీ అనుచరుల సంపద సృష్టి కోసమే నూతన మద్యం పాలసీ తీసుకొచ్చారు. తాజా మద్యం పాలసీలో పేరుకే లాటరీ.. షాపులు దక్కించుకున్నది మాత్రం అధికారపార్టీ అనుచరులే. ఈ లోగుట్టు కూటమి నేతలకే తెలియాలి. పెందుర్తి నియోజకవర్గ పరిధిలో 55 మద్యం దుకాణాలకు అనుమతులిచ్చారు. గత అనుభవాల నేపథ్యంలో ఊరూవాడా మద్యం ఏరులై పారడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి కనుసన్నల్లో ప్రైవేట్ మద్యం దుకాణాలు



శాశ్వతంగా మూతపడ్డ ప్రభుత్వ మద్యం దుకాణం

- నేటి నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాల్లో అమ్మకాలు
- పెందుర్తి, పరవాడ, సబ్బవరంలో 55 దుకాణాలకు అనుమతి
- టీడీపీ–జనసేన నాయకుల కనుసన్నల్లోనే దుకాణాలు!
- గ్రామాల్లో విచ్చలవిడిగా పెరగనున్న బెల్ట్ షాపులు
- శాశ్వతంగా మూతపడ్డ ప్రభుత్వ మద్యం దుకాణాలు
- రోడ్డున పడ్డ 530 మంది సిబ్బంది



ఏపీ బెవరేజస్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది (ఫైల్)

పెందుర్తి: కూటమి ప్రభుత్వం పాత మద్యం పాలసీకి స్వస్తి పలికి, నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. లాటరీ ప్రక్రియ కూడా ముగిసింది. నియోజకవర్గంలోని పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల్లో 55 ప్రైవేట్ మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేసింది. పెందుర్తి ఎక్సైజ్ విభాగం పరిధిలో 36, పరవాడలో 11, సబ్బవరంలో 8 దుకాణాల్లో బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి.

సిండికేట్‌దే రాజ్యం

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేంత వరకు మద్యం వ్యాపారంలో సిండికేట్‌దే రాజ్యం. అప్పట్లో ప్రైవేట్ మద్యం పాలసీ అమలు కావడంతో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడేవారు. మద్యం వినియోగదారులను ఇష్టానుసారం దోచుకునేవారు. విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలను ప్రోత్సహించి.. అవసరం అయితే బెల్ట్ దుకాణాల నిర్వాహకుల ఇళ్లకే మద్యాన్ని సరఫరా చేసేవారు. గ్రామాల్లో నిరంతరం మద్యం అందుబాటులో ఉండేలా చూసుకునేవారు. అయితే 2019లో ప్రవేటు మద్యం పాలసీని పూర్తిగా రద్దు చేసి.. బెల్ట్ దుకాణాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియంత్రించిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రైవేట్ పరం చేయడంతో అంతా సిండికేట్ల చేతిలోకి వెళ్లిపోయింది.

రోడ్డున పడ్డ 530 మంది

తాజా మద్యం పాలసీతో ఇప్పటివరకు నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని 530 మంది సిబ్బందిని ప్రభుత్వం అర్ధంతరంగా తొలగించింది. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వ ఐదేళ్లుగా మద్యం దుకాణాల ద్వారా ఉపాధి పొందుతున్న సిబ్బంది పొట్ట కొట్టింది. ఐదేళ్లుగా సూపర్ వైజర్లు రూ.18 వేలు, సేల్స్‌మెన్లు రూ.16,500, సెక్యూరిటీ సిబ్బంది రూ.10 వేల వేతనంతో కొద్దోగొప్పో బతుకు సాగించేవారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో నియోజకవర్గంలోని 106 ఏపీ బెవరేజెస్ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

ఉపాధి కల్పించాలి



ఐదేళ్లుగా మద్యం దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగిస్తే మా కుటుంబాలు అన్యాయం అయిపోతాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి. మంగళవారం రాత్రి నుంచి మేమంతా నిరుద్యోగులం అయ్యాం. ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి.

– పోతల జగదీష్, సేల్స్‌మెన్, పెందుర్తి

కరోనా టైంలోనూ పనిచేశాం



ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం వెతుకున్న సమయంలో మద్యం దుకాణంలో ఉపాధి అవకాశం దక్కింది. గౌరవప్రద వేతనం ఇచ్చేవారు. కరోనా సమయంలో కూడా మద్యం వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహించాం. ఇప్పుడు ఇలా మమ్మల్ని రోడ్డున పడేసే పరిస్థితి వస్తే మేం ఎలా బతకాలి. ఉపాధి కల్పించక పోగా ఉన్న ఉపాధిని తొలగించడం అన్యాయం.

– ఎం.నవీన్‌కుమార్, పెందుర్తి

నూతన పాలసీ పక్కాగా అమలు

మా సర్కిల్ పరిధిలో పెందుర్తి గ్రామీణం, అర్బన్ ప్రాంతాల్లో 36 దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేశాం. మండలం యూనిట్‌గా దుకాణాలు కేటాయించాం కాబట్టి వారికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే పాఠశాలలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర నిషేధిత ప్రాంతాల్లో దుకాణాలు పెడితే తక్షణమే చర్యలు తీసుకుంటాం. ఎక్కడా బెల్ట్ దుకాణాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే మద్యం వ్యాపారం సాగించాలి.

– సరోజాదేవి, సెబ్ సీఐ, పెందుర్తి సర్కిల్

రేపటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

సబ్బవరం: మండలంలో సమగ్ర భూ రీసర్వే పూర్తయిన 20 గ్రామాల్లో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 11 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చిన్నికృష్ణ మంగళవారం మీడియాకు తెలిపారు. జిల్లాలో రీ సర్వే పూర్తయిన 455 గ్రామాల్లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలపై రైతులు రెవెన్యూ సదస్సుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, అర్జీలను అందించవచ్చన్నారు. రీ సర్వేలో భూముల విస్తీర్ణాల్లో తేడాలున్నా, సర్వే నెంబర్లు, భూ యజమానుల పేర్లు తప్పుగా నమోదైనా వాటిని సరిదిద్దించుకునేందుకు అర్జీలను దాఖలు చేయవచ్చన్నారు. గ్రామ సభలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహిస్తామన్నారు.

గ్రామాల వారీ సదస్సులు జరిగే తేదీలు

గ్రామం	తేదీ
విప్పాక అగ్రహారం	17
పైడివాడ	18
అసకపల్లి	19
ఎరుకునాయుడుపాలెం	21
చింతగట్ల అగ్రహారం	22
గొటివాడ	23
గాలిభీమవరం	24
లగిశెట్టిపాలెం	25
రాయపుర అగ్రహారం	26
బంగారమ్మపాలెం	28
అడ్డూరు సిరసపల్లి	29
సబ్బవరం	30
అయ్యన్నపాలెం	01
బోదువలస	02
ఎల్లుప్పి	05
మొగలిపురం	06
నారపాడు	07
టెక్కలిపాలెం	08
ఇరువాడ	09
పైడివాడ అగ్రహారం	11

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల సమగ్రాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ రమేష్, చిత్రంలో ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

- పల్లెపండగలో అనకాపల్లి ఎంపీ రమేష్

సబ్బవరం: గ్రామాల సమగ్రాభివృద్ధి, స్థానికులకు ఉపాధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్ అన్నారు. మండలంలోని గొటివాడ కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీల సమగ్ర అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. రూ.4,500 కోట్ల నిధులతో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి, శంకుస్థాపనల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన సూచనల మేరకే గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. సబ్బవరం పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13,325 పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసేందుకు పవన్‌కల్యాణ్ శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని పలు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. మండలంలోని పెట్రోలియం యూనివర్సిటీ, మారిటైం యూనివర్సిటీ, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో స్థానికులకే ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, గొటివాడ సర్పంచ్ సాలాపు మీన, ఎంపీటీసీ బొండా శేషుకుమారి, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, కూటమి నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, మిడతాడ మహాలక్ష్మినాయుడు, బర్నికాన బాబూరావు, గొర్లి రామునాయుడు, కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ విద్యార్థులకు ర్యాంకుల పంట

- బీఎస్సీ అగ్రిసెట్‌లో టాప్ ర్యాంకులు కైవసం



ఎం.అహ్మద్ (13వ ర్యాంక్)



పి.సుజాత (16వ ర్యాంక్)

అనకాపల్లి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన అగ్రిసెట్ 2024 ఫలితాల్లో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. తమ విద్యార్థులకు వందలోపు ఆరు ర్యాంకులు వచ్చాయని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చారుమతి తెలిపారు. అనకాపల్లి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు 13, 16, 20, 41, 43, 58, 71, 86, 98, 119, 122, 126, 135, 143, 153, 161 ర్యాంకులు లభించాయి. విజేతలను మంగళవారం కళాశాలలో అభినందించారు. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకూ ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని ఏడీఆర్ ముకుందరావు చెప్పారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులు వీరే..

ఎం.అహ్మద్ (13వ ర్యాంక్), పి.సుజాత (16వ ర్యాంక్), వై.శాంతి (20), కె.రాహుల్‌రెడ్డి (41), యు.లిఖిత (43), యు.శేఖర్‌బాబు (58), డి.దివ్యశ్రీ (71), ఎస్.తేజేశ్వరి (86), ఎల్.మమత (98), బి.నమ్రత (119), ఎం.శివవాణి (122), బి.దిల్లేశ్వరి (126), పి.హుస్సేన్ (135), వి.గౌరేశ్వరి (143), ఎస్.నితిన్ (153), వై.ఎస్.వి.లక్ష్మి (161వ ర్యాంక్)

ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం



నిత్యావసర సరకుల ధరల పెరుగుదలపై రైతు బజార్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, ప్రజలు

- ఎన్డీయే ప్రభుత్వంలో నిత్యావసర సరకుల ధరలకు రెక్కలు
- పెందుర్తి రైతుబజార్ వద్ద సీపీఐ నేతృత్వంలో ఆందోళన

పెందుర్తి: ఎన్నికల సమయంలో నిత్యావసరాల ధరలు పెరగకుండా, వాటికి అడ్డుకట్ట వేసి ప్రజలకు అండగా ఉంటామని బూటకపు హామీలతో గద్దెనెక్కిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు అత్తిలి విమల ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు పాలనలో సామాన్యులు కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదని ఆక్షేపించారు. రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ వద్ద ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ ఓ వైపు తగిన విధివిధానాల్లేని ఇసుక పాలసీ కారణంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో నిత్యావసరాల ధరలు ఇంత దారుణంగా పెరగడం విచారకరం అన్నారు. విజనరీగా చెప్పుకునే సీఎం చంద్రబాబుకు మోసం తప్ప, ప్రజల బాగోగులు పట్టవని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించి, నాలుగు నెలల పాలనలో కనీస అమలుకు నోచుకున్న హామీల్లేవని మండిపడ్డారు. నిత్యావసరాల ధరలు పెరిగి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కులాలు, మతాల పేరిట వైషమ్యాలను పెంచేలా దీక్షలు అంటూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాయితీ ధరలపై రైతు బజార్లలో విక్రయిస్తున్న టమాటాలు, ఇతర సరకుల నాణ్యత ఎంత దారుణంగా ఉందో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యావసరాల ధరలను అదుపులోకి తెచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, అన్నపూర్ణ, ఆసిరినాయుడు, ఎ.రమణ, కె.రామారావు, అరుణ, రజని, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'హైస్కూల్ సమీపంలో మద్యం షాపు వద్దు'



జెడ్పీ హైస్కూల్‌కు సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అతి సమీపంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని వేరొక ప్రదేశానికి తరలించేలా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు బండారు రామునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణం ఉంటే విద్యార్థులపై చెడు ప్రభావం చూపే ప్రమాదముందన్నారు. నిబంధనల మేరకు గుడి, బడికి సమీపంలో మద్యం షాపుల్ని ఏర్పాటు చేయరాదన్నారు. ఈ మద్యం షాపును తరలించాలని ఇప్పటికే స్థానిక ప్రజలు ఎక్సైజ్ అధికారుల్ని అభ్యర్థించినా, పట్టించుకోలేదన్నారు. ఈ మద్యం దుకాణాన్ని దాటుకుంటూనే విద్యార్థులు రాకపోకలు సాగించాలని, ఇక్కడ మందుబాబుల ఆగడాలు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని తక్షణమే వేరే చోటుకి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారుల్ని ఆ ప్రకటనలో కోరారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహం చేతిపై ఈగల్ పచ్చబొట్టు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరానికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానిక మత్స్యకారులు గుర్తించి పరవాడ పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. తీరానికి చేరిన మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. శరీరంపై దుస్తుల్లేవు. కుడిచేతిపై ఎగురుతున్న ఈగల్ బొమ్మతో పాటు 27, ఎస్ డబ్ల్యూ ఎఫ్, ఎడమ చేతిపై 8, అండ్ సింబల్ పచ్చబొట్టు ఆనవాళ్లు ఉన్నాయి. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో 15 రోజుల క్రితం మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన తప్పిపోయిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మృతదేహాన్ని గుర్తించిన వారు 9440796038 నంబరును సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



అయ్యప్ప భక్తులతో మాలధారణ చేయిస్తున్న గురుస్వామి చంద్రశేఖర్‌రెడ్డి

పెందుర్తి: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త, గురుస్వామి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా భక్తులు మాలధారణ చేశారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. మాలధారులకు మండల దీక్ష నియమాలను వివరించారు.

జన్యుకారణాలతో డిస్లెక్సియా బాధితులు

- జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి శకుంతల

అనకాపల్లి: స్పెసిఫిక్ లెర్నింగ్ డిజార్డర్‌లో 80 శాతం మంది డిస్లెక్సియా(భాషా అవరోధ బలహీనత) బాధితులుగా ఉన్నారని, ఇది జన్యుకారణాలతో ఏర్పడిన నాడీ సంబంధిత వైవిధ్యత అని జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.శకుంతల తెలిపారు. మండలంలోని మామిడిపాలెంలో హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం డిస్లెక్సియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిస్లెక్సియా ఇన్విజిబుల్ నాడీ సంబంధిత వైవిధ్యం అని, వీరి ఐక్యూ సగటు ప్రజ్ఞ కన్నా అధికంగా ఉంటుందన్నారు. చదివే విషయంలో సమస్యలు ఉండటాన్ని డిస్లెక్సియా అంటారని పేర్కొన్నారు. రాయడంలో అవరోధాలు ఉంటే డిస్క్‌గ్రాఫియా అని, గణిత సమస్యలు చేయటంలో సమస్యలు ఉంటే డిస్కాల్క్యూలా అని వివరించారు. శరీరంలోని వివిధ భాగాలలో సమన్వయం లోపిస్తే డిస్ప్రేసియా అంటారని వివరించారు. ప్రత్యేక విద్యాశాఖ ఉపాధ్యాయుడు బి.వి.వరప్రసాద్ మాట్లాడుతూ వీరిని ఎనిమిది సంవత్సరాల వయస్సు వచ్చే నాటికి గుర్తించి, విద్యాపరమైన విషయాలలో సర్దుబాటు చేసుకునేందుకు విస్తృతమైన అభ్యాసన అనుభవాలు అందించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. పిల్లల్లో ఈ లక్షణాలను ఎంత వేగంగా గుర్తిస్తే అంతవేగంగా వారిని సరిదిద్దుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.శ్రీధర్, ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయ్, వసంతరావు, పట్టాభి దయాసాగర్, కామేశ్వరరావు, శేషు, విద్యార్థులు పాల్గొన్నారు.